సాక్షి
చిత్తూరు
మంగళవారం । 21 । జనవరి । 2025



ఉపాధి పనుల తనిఖీ
యాదమరి మండలం కోనాపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆ పథకం డీవీఓ శివయ్య తనిఖీ చేశారు. - 8లో



వినతుల వెల్లువ
కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. - 8లో



ఈవెంట్స్‌కు అనుమతించండి
కానిస్టేబుల్ పోస్టుల దేహదారుఢ్య పరీక్షల (ఈవెంట్స్)కు తను అనుమతించాలని పలువురు అభ్యర్థులు డీజీపీని కోరారు. - 8లో

న్యూస్‌రీల్

పోలీసు గ్రీవెన్స్‌కు 66 ఫిర్యాదులు



సమస్య వింటున్న ఏఎస్పీ రాజశేఖర్ రాజు

చిత్తూరు అర్బన్: నగరంలో నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 66 వినతులు అందాయి. చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్‌రాజు ఏఆర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా స్టేషన్ హౌజ్ అధికారులతో మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యపై విచారణ జరిపి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ సైతం ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకున్నారు.

పశు ఆరోగ్య పరిరక్షణకే శిబిరాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

చిత్తూరు కలెక్టరేట్ : పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసమే ఉచిత పశు ఆరోగ్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఈ నెల 20వ తేదీ నుంచి ఉచిత పశు ఆరోగ్యశిబిరాలు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు జరిగే ఈ శిబిరాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పశువుల ఆరోగ్యానికి, ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి, పశుపోషణ ఖర్చులు తగ్గించేందుకు ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచిత పశు ఆరోగ్య శిబిరాల్లో పశు వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు చేయించి, ఉచితంగా వైద్యం అందిస్తారన్నారు. తేలికపాటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారన్నారు. ఎదకు రాని, చూలు కట్టని, ఇతర గర్భకోశవ్యాధులకు పరీక్షలు నిర్వహించి, తగు వైద్యం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్‌కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ భావం ఉట్టిపడేలా గణతంత్ర దినోత్సవానికి ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని డీఆర్వో మోహన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవం ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ 76వ గణతంత్ర దినోత్సవ కార్యక్రమం పూర్తి సమన్వయం బాధ్యలను చిత్తూరు ఆర్డీఓ, ప్రోటోకాల్, సీటింగ్ ఏర్పాట్లు, ఆహ్వాన పత్రికల ముద్రణ పంపిణీ విధులు చిత్తూరు తహసీల్దార్ చూసుకోవాలన్నారు. భద్రతా ఏర్పాట్లు, స్టేజీ డెకరేషన్ విధులు పోలీస్ శాఖ, సాంస్కృతిక కార్యక్రమాల బాధ్యత డీఈఓ పర్యవేక్షించాలన్నారు. ఆస్తుల పంపిణీ కార్యక్రమం డీఆర్‌డీఏ పీడీ, అత్యవసర వైద్య సేవలను డీఎంఅండ్‌హెచ్ఓ, పారిశుద్ధ్యం, నీటి సరఫరా విధులను చిత్తూరు మున్సిపల్ కమిషనర్, అగ్నిమాపక వాహనాల ఏర్పాట్లను జిల్లా అగ్నిమాపకశాఖ చేపట్టాలన్నారు. స్టాల్స్ ఏర్పాటును వ్యవసాయ శాఖ జేడీ, సమగ్ర శిక్ష ఏపీసీ, హౌసింగ్ పీడీ, డీఆర్‌డీఏ పీడీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ, విస్తృత ప్రచార ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టమ్ సమాచార శాఖ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ బాబు, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు రవి కుమార్, శ్రీదేవి, డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు భూపతి నాయుడు. ఈయనది పెనుమూరు మండలం ఉప్పెనపల్లి. ఈయకు ఐదు ఎకరాల పొలం ఉంది. గత ఏడాది వరకు వర్షాధారంగా వరి, వేరుశనగ పంటలు సాగు చేశారు. గత వేసవిలో రూ.10 వేలు ఖర్చు పెట్టి పొలం దుక్కులు దున్నారు. ప్రస్తుతం వర్షాధార పంటగా వేరుశనగ సాగు చేయాలని భావించారు. సకాలంలో వర్షాలు కురవక, నీటి వసతి లేక పంట సాగు మానేశారు. ప్రస్తుతం పొలాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోవడంతో తమ కుటుంబం ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బైరెడ్డిపల్లె మండలంలో ఎండిన క్యాబేజీ పంటను మేస్తున్న గొర్రెలు

సేద్యం.. కన్నీటి నైవేద్యం



వరుణుడు కన్నెర్ర చేశాడు.. అన్నదాతపై పగ పట్టాడు.. ఈ ఏడాది అలకబూనాడు.. పంటలన్నీ ఎండిపోయాయి.. రబీ సీజన్‌లో సాగు సాగక చేలన్నీ బీళ్లుగా మారాయి.. కాడీ, మేడీ మూలకు చేరాయి.. పల్లెలన్నీ బోసిపోయాయి.. అన్నదాత కళ్లలో కన్నీళ్లువొలుకుతున్నాయి.. జిల్లాలో ఏ గ్రామంలో చూసినా ఇవే దృశ్యాలు.. ఏ ఇంట రైతును కదిపినా ఈ కన్నీటి వెతలే వినిపిస్తున్నాయి.. ప్రభుత్వ పెట్టుబడి సాయం అందక, సాగుకు చేసిన అప్పులు తీరే దారేదని రోదిస్తున్నాయి.. పంటలు పండక.. పిల్లలను చదివించలేక..కుటుంబాలను పోషించలేక.. బతికేదెలా.. అని దిక్కులు చూస్తున్నాయి. ఇదీ చిత్తూరు జిల్లా కన్నీటి కథ.

ఎండిన పైర్లు..బీళ్లుగా పొలాలు
- జిల్లాలో మూడు మండలాల్లోనే తీవ్ర కరువు
- మిగిలిన 13 మండలాల్లో మధ్యస్థ కరువు
- కరువు మండలాలను పట్టించుకోని కూటమి

చిత్తూరు కలెక్టరేట్ : ఎండిపోయిన పైర్లు.. బీళ్లుగా మారిన పొలాలు.. కబేళాలకు తరలుతున్న పశువులు, వలస బాట పట్టిన రైతన్నలు. జిల్లాల్లోని పలు గ్రామాల్లో ఇలాంటి హృదయ విదారక దృశ్యాలే కనిపిస్తున్నాయి. అన్నదాతలు కరువు కాటుకు చిక్కి విలవిల్లాడుతున్నారు. పంటల సాగు కోసం చేసిన అప్పులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇంతటి కరువును తమ జీవితంలో ఎప్పుడూ చూడలేదని రైతులు బోరుమంటున్నారు. దుర్భిక్షం దాటికి పంటలు ఎండిపోయి, దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్న తమను ప్రభుత్వం సైతం ఆదుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసిన పంట చేతికి రాక, ఉన్న ఊళ్లో బతుకుదెరువు లేక పొట్ట చేత పట్టుకుని పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు.

నెర్రెలిచ్చిన పొలాలు..
పచ్చని పైర్లతో కళకళలాడాల్సిన పంట భూములు కరువు ధాటికి బీళ్లుగా మారాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటలు పండించేందుకు తేమ నీరు లేక రైతులు మిన్నకుండి పోయారు. టమాట, మిరప, బెండ తదితర కూరగాయల తోటలు సైతం చేతికి రాకుండా పోయాయి. అప్పులు చేసి సాగు చేసిన పంటలు కరువు కాటుకు మట్టిలోనే కలిసిపోవడంతో రైతన్నలు కుమిలిపోతున్నారు. చేసిన అప్పులు భయపెడుతున్నాయి. కరువు మండలాల్లో చాలాచోట్ల తాగడానికి నీరు దొరక్క జనం అల్లాడిపోతున్నారు. దుర్భిక్షంతో మేత, నీరు సమకూర్చడం కష్టం కావడంతో చాలామంది రైతులు విధిలేని పరిస్థితుల్లో పశువులను కారు చౌకగా కబేళాలకు విక్రయిస్తున్నారు. జిల్లా నుంచి సమీపంలోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు లారీల్లో కబేళాలకు తరలించేస్తున్నారు. కరువు మండలాల్లోని ఎంతోమంది అన్నదాతలు పొట్ట చేత పట్టుకుని పక్క రాష్ట్రాలకు వలస వెళ్లిపోతున్నారు.

ఉపాధి కోసం ఊరు వదిలి..
జిల్లాలోని చాలా మండలాల్లో రైతులు పంటలు పండించుకునేందుకు అవకాశం లేక ఉపాధి కోసం ఊర్లు వదిలి వెళ్లి పోతున్నారు. తీవ్ర కరువు, మధ్యస్థ కరువు ఉన్న మండలాల్లోని రైతులు, రైతు కూలీలుగా మారుతున్నారు. పొట్ట చేత పట్టుకుని పొట్టకూటి కోసం సమీపంలోని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలివెళ్లిపోతున్నారు. వలస వెళ్ల లేని వారు గ్రామాల్లో రచ్చబండలు, గ్రామ చావిళ్ల వద్ద కూర్చుని మథన పడుతున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు
ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురువకపోవడం, అరకొర వర్షాలతో చాలా బోరుబావులు ఎండిపోవడంతో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో పంట సాగు చేయలేక రైతులు అలమటిస్తున్నారు. అడపాదడపా వచ్చిన వాన నీళ్లు ఎక్కడికక్కడే భూమిలోకి ఇంకిపోయాయి. నదులు పారలేదు. నీటి చుక్క కనిపించలేదు. గత జూన్‌లో కురిసిన తేలికపాటి వర్షాలకు పంటలు సాగు చేశారు. నీటి సౌకర్యం సరిగ్గా లేక, సమయానికి వర్షాలు కురవకపోవడంతో పంటలు చేతికందక రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు.

వట్టిపోతున్న బోర్లు..
జిల్లాలోని గంగాధరనెల్లూరు నియోజకవర్గం పెనుమూరు, పూతలపట్టు నియోజకవర్గం యాదమరి, చిత్తూరు నియోజకవర్గం గుడిపాల మండలాల్లోని చాలా వరకు గ్రామాల్లో అతి తక్కువ వర్షపాతం కురవడంతో బోర్లు ఎండిపోతున్నాయి. ఆ మూడు మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ఇటీవల ప్రకటించింది. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో కొద్దిపాటి వర్షం కురిసింది. అయితే ఆ కొద్దిపాటి వర్షంతో ఎలాంటి ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా వరకు పంటలు ఎండిపోయాయని ఆ మూడు మండలాల రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. దిగుబడి చాలా వరకు తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాధారంగా సాగు చేసిన పంటలే కాకుండా బోర్ల కింద సాగు చేసిన పైర్లు కూడా ఎండిపోతున్నాయి. భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోయిందని మూడు మండలాల రైతులు వెల్లడిస్తున్నారు.



ఎస్ఆర్‌పురం మండలంలో ఎండిన వేరుశనగ పంట

మూడంటే మూడే కరువు మండలాలు
మూడంటే మూడు మండలాలనే చంద్రబాబు సర్కార్ కరువు జాబితాలో చేర్చడంతో రైతన్నలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో 13 మండలాల్లో మధ్యస్థ కరువుగా ప్రకటించడంతో మిగిలిన మండలాల్లో కరువు కనిపించలేదా? అని ప్రశ్నిస్తున్నారు. చాలా మండలాల్లో కరువు తాండవిస్తున్నప్పటికీ చంద్రబాబునాయుడు మూడు మండలాల్లో మాత్రమే తీవ్ర కరువు ఉందని గత ఏడాది నవంబర్‌లో ప్రకటించడం చాలా దారుణమని రైతులు మండిపడుతున్నారు.

పంట సాగు చేయలేకపోతున్నాను



నాకు మూడు ఎకరాల పొలం ఉంది. అందులో వేరుశనగ సాగు చేశాను అయితే వర్షాభావ పరిస్థితులతో ఆ పంట పూర్తిగా ఎండిపోయింది. ప్రస్తుతం మళ్లీ సాగు చేయడానికి నీరు లేదు. పంట సాగుతో నష్టపోయిన మా కుటుంబానికి బతుకుదెరువు కష్టంగా మారింది. మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి.
– బాబు, చిన్నతయ్యూరు గ్రామం, ఎస్ఆర్‌పురం మండలం

నీటిని తోలినా ఫలితం లేదు



నాకు 2.5 ఎకరాల భూమి ఉంది. వర్షం కురుస్తుందన్న ఆశతో ప్రభుత్వం అందించే రాయితీ వేరుశనగ విత్తనాలు తీసుకుని, దుక్కి దున్ని పంట సాగు చేశాను. తీరా చూస్తే వర్షం ముఖం చాటేసింది. నా వేరుశనగ పంటను కాపాడుకునేందుకు అప్పులు చేసి పిచికారి మందులు, ట్యాంకర్లతో నీటిని తోలి పంటను కాపాడుకునేందుకు ప్రయత్నించాను. అయినా నా ప్రయత్నం ఫలించలేదు. పంట మొత్తం ఎండిపోయి నాశనం అయిపోయింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.
– చెంగల్‌రాయులు, పెద్దతయ్యూరు, ఎస్ఆర్‌పురం మండలం

చివరకు అప్పులే మిగిలాయి



నాకున్న కొంత భూమిలో వేరుశనగ పంట సాగు చేశా. నీరు సరిపోదనే ఉద్దేశంతో ట్యాంకర్లతో తోలించాను. అందు కోసం రూ.50 వేల వరకు ఖర్చు చేశాను. ఎంత ఖర్చు చేసినా పంట మాత్రం చేతికందలేదు. ఇన్నాళ్లూ నేను చేసిన కష్టమంతా మట్టిపాలైంది. చివరకు అప్పులే మిగిలాయి.
– రెడ్డెప్ప, రైతు, గుడిపాల మండలం

ప్రభుత్వమే ఆదుకోవాలి



కరువుతో పంట నష్టం జరిగిన రైతులను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలి. పంటలు కోల్పోయిన రైతాంగం ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఇటీవల కురిసిన వాన అంత ప్రయోజనమేమి కల్పించలేదు. దీంతో పంటలంతా ఎండిపోయాయి. కనీసం పశువులకు మేత కూడా దొరకడం లేదు. పెట్టిన పెట్టుబడి అంతా మట్టిపాలైంది.
– శ్రీనివాసులు, రైతు, దాసెగానూరు, కుప్పం

'ఏంటి మా పార్టీ వాడని తెలిసి కూడా కేసు పెట్టావ్. ఇంతకు ముందు ఇలాంటివి చాలా జరిగినా చూస్తూనే కదా ఉన్నారు. పేకాట అనేదా చాలా మామూలు విషయం. నువ్వు మాకు అవసరంలేదు. అసలు మాకు పోలీస్‌స్టేషనే వద్దు. వెళ్లిపో..'
– పూతలపట్టు నియోజకవర్గంలో ఓ ఎస్‌ఐని పంపించేసిన నేత మాటలివి

'సార్, ఆ పార్టీ నుంచి వచ్చినా, ఇప్పుడు ఉండేది మన పార్టీలోనే. క్యాడర్ బతకాలన్నా, మనం పెట్టిన ఖర్చు తిరిగి రావాలన్నా పేకాట లాంటివి చూసీ చూడనట్లు వెళుతూ ఉండాలి. నెలకు మీకెంతో చెప్పి, పర్మిషన్ ఇచ్చేయండి. ఏదైనా ఉంటే అన్నతో మాట్లాడుకుంటా. అయినా మీ బాస్‌కు ఇప్పుడు చిత్తూరు ఒక్కటే కాదు. కదా. తిరుపతి కూడా. ఇవన్నీ ఆయన నోటీస్‌లో ఉండవులే..'
– చిత్తూరులో ఓ పోలీస్ అధికారికి కూటమి నేత ఫోన్‌కాల్ సారాంశం



పేకాటే బరి.. రూ.కోట్లే గురి!

లోపల.. బయట. చిత్తూరులో జోరుగా సాగుతున్న జూదం ఇదే. కూటమి నేతల కనుసన్నల్లో పేకాట క్లబ్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నెలకు రూ.కోట్లలో లావాదేవీలు జరుగుతున్నాయి. పలువురు భారీగా డబ్బులు పోగొట్టుకుని రోడ్డున పడుతున్నారు. అన్నీ తెలిసినా చర్యలు తీసుకోవాల్సిన పోలీసుశాఖలోని కొందరు అధికారులు.. ఈ వికృత క్రీడకు అనుమతులిస్తుండటం గమనార్హం.

క్లబ్బూ మాదే.. డబ్బూ మాకే..!
- చిత్తూరులో వీధి వీధికీ పేకాట క్లబ్బులు
- రూ.కోట్లలో టర్నోవర్
- నెలసరి మామూళ్లతో అనుమతులిస్తున్న ఖాకీలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పేకాట క్లబ్‌లు పెద్ద ఎత్తున నడుస్తున్నాయి. నగరంలోని సంతపేట, వన్నియర్ బ్లాక్, తేనబండ, కట్టమంచి, రామ్‌నగర్ కాలనీ, గిరింపేట, కొంగారెడ్డిపల్లె, కైలాసపురం, సత్యనారాయణపురం, దుర్గానగర్ కాలనీ, హై రోడ్డులోని ఓ సిమెంట్ దుకాణం, గంగనపల్లె, బాలాజీ కాలనీ, ముత్తిరేవుల, పూనేపల్లె, దొడ్డిపల్లె, కట్టిలదొడ్డి ప్రాంతం, కాణిపాకం బైపాస్‌లోని ఓ దాబా ప్రాంతాల వద్ద పేకాట క్లబ్‌లు నడుస్తున్నాయి. వీటిల్లో ప్రధానంగా సాగుతున్న జూదం లోపల–బయట. గంటల్లో ఒక్కొక్కరు రూ.లక్షల్లో పోగొట్టుకోవడం, మరికొందరు రూ.లక్షలు రాబట్టుకోవడం జరుగుతోంది. నెలకు రూ.కోట్లలో టర్నోవర్ జరుగుతోంది.

భారీ ఆదాయం..
ఈ క్లబ్‌లు నిర్వహిస్తున్న వారంతా కూటమి పార్టీకి చెందిన వారే. మరికొందరు గతంలో వైఎస్సార్‌సీపీలో ఉంటూ ఇప్పుడు కూటమిలో కొనసాగుతున్న వారూ ఉన్నారు. కొందరు కార్పొరేటర్ స్థాయి, వార్డు ఇన్‌చార్జ్‌లు, మహిళా కార్పొరేటర్లకు చెందిన పతులు కూడా ఉన్నారు. రోజుకు రూ.30 వేల వరకు క్లబ్ నిర్వహణ వ్యయంగా వసూలు చేస్తున్నారు. డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తికి ఎలాంటి పూచీకత్తు లేకుండా అప్పటికప్పుడే డబ్బులు ఇచ్చే వాళ్లూ ఉన్నారు. రూ.లక్ష ఇస్తే సాయంత్రంలోపు రూ.1.20 లక్షలు ఇచ్చేయాలి. అంటే రోజుకు రూ.లక్షకు రూ.20 వేలు వడ్డీ అన్నమాట. ఇలా వడ్డీలకు ఇచ్చే వ్యక్తులు, క్లబ్ నిర్వాహకులకు రూ.20 వేలు చెల్లించాలి.

4 టేబుళ్లు, 12 కుర్చీలే పెట్టుబడిగా
నాలుగు టేబుళ్లు, 12 కుర్చీలే పెట్టుబడిగా సాగుతున్న ఈ జూదం కూటమి పార్టీలోని కొందరు నేతలకు భారీగా కాసుల వర్షం కురిపిస్తోంది. అయితే దీన్ని అదే పార్టీలోని చాలా మంది నేతలు, కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు. చిత్తూరు హైరోడ్డులోని ఓ సిమెంటు దుకాణంలో నిర్వహిస్తున్న పేకాట వ్యవహారంపై, కూటమి పార్టీకి చెందిన బీసీ నేత తమ నాయకుడికి ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపానపోలేదు. అన్నీ తెలిసినా కొందరు పోలీసు అధికారులు నెలసరి మామూళ్లు తీసుకుంటూ క్లబ్‌లకు పర్మిషన్లు ఇస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. జరుగుతున్న తంతంగం మొత్తం తెలిసినా, పోలీస్ బాస్ చెవిలో పడేయాల్సిన స్పెషల్ బ్రాంచ్ మిన్నకుండిపోవడం..ఆ విభాగానికి సైతం మరకలేమైనా అంటుకున్నాయా..? అనే అనుమానాలను రేకెత్తిస్తోంది.

చర్యలు తీసుకుంటాం..



పేకాట ఎక్కడెక్కడ ఆడుతున్నారో ఎవరైనా సమాచారం ఇస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. మా వాళ్లు ఎవరైనా తప్పు చేస్తే, వారిపైనే సీరియస్ యాక్షన్ ఉంటుంది. ఎక్కడైనా పేకాట ఆడుతున్నా డయల్–100, పోలీసు వాట్సప్–9440900005, నా నంబర్ 9440796704 కూడా ఫోన్ చేసి చెప్పండి. సమాచారం ఇచ్చిన వాళ్ల వివరాలు రహస్యంగా ఉంచుతాం.
– సాయినాథ్, డీఎస్పీ, చిత్తూరు

మరోసారి పింఛన్‌దారుల సర్టిఫికెట్ల పరిశీలన



డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మరోసారి పింఛన్‌దారుల సదరం సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పింఛన్‌దారుల సర్టిఫికెట్లను పరిశీలించేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని కుప్పం, నగరి, పలమనేరు, చిత్తూరు ప్రభుత్వాస్పత్రుల్లో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు క్యాంపులు నిర్వహిస్తామన్నారు. అలాగే ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో వారంలో మూడు రోజుల చొప్పున క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్యాంపుల నిర్వహణ విషయాన్ని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ముందస్తుగా పింఛన్‌దారులకు నోటీసుల రూపంలో తెలియజేయాలన్నారు. రోజుకు 50 మందిని పరిశీలిస్తారన్నారు. డాక్టర్లు మరోసారి అంగవైకల్యాన్ని పరిశీలించి సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. క్యాంపుల షెడ్యూల్‌ను ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లకు పంపినట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం పింఛన్‌దార్లను క్యాంపులకు తీసుకొచ్చేలా పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఆదేశించారు.

క్లుప్తంగా

'హలో బీసీ..ఛలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఓబీసీ రిజర్వేషన్ సాధనకు ఫిబ్రవరి 6వ తేదీన బీసీ సంక్షేమ సంఘం నిర్వహించనున్న హలో బీసీ.. ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జ్ షణ్ముగం పిలుపునిచ్చారు. చిత్తూరు నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం హలో బీసీ.. ఛలో ఢిల్లీ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రత్యేకమైన మంత్రిత్వ శాఖను బీసీలకు ఇవ్వాలన్నారు. బీసీ కులగణన చేయాలని, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసల రవి, వెంకటేష్ శివకుమార్, వడ్డెర సంఘం అధ్యక్షుడు రవి, శంకర్, హరి తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయి అదృశ్యంపై కేసు నమోదు

పెద్దపంజాణి: అమ్మాయి అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సహదేవి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ అమ్మాయి(16) ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఇప్పటి వరకూ ఇంటికి రాలేదని అమ్మాయి తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బోరు మోటారు వైర్ల చోరీ



పాపసముద్రం వద్ద చోరులు వదిలివేసి వెళ్లిన వైర్లు

గుడిపాల: మండలంలోని పలు గ్రామాల్లో బోరు మోటారు వైర్లు చోరీకి గురయ్యాయి. మండలంలోని పాపసముద్రం, పిల్లారికుప్పం, అడవిచేను గ్రామాల్లోని రైతులకు సంబంధించి వ్యవసాయ భూముల్లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బోరు మోటారు వైర్లను చోరీ చేశారు. గతంలో కూడా ఇలానే చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కొందరు రైతులు వాపోయారు. బోరు వద్ద నుంచి స్టార్టర్ వరకు ఉన్న వైర్లను తరచూ దొంగతనాలు చేస్తున్నారని వాపోయారు. దీంతో పాటు సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనాల దొంగతనాలు కూడా విపరీతంగా జరుగుతున్నాయని వీటిపై పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఉంచి దొంగలను పట్టుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వినతుల వెల్లువ

- పీజీఆర్ఎస్‌కు 276 అర్జీలు నమోదు
- వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జేసీ విద్యాధరి
- వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు
- అర్జీల పరిష్కారంలో అలసత్వం వొద్దని కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్: ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతుల వెల్లువెత్తాయి. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు విచ్చేశారు. వివిధ శాఖలకు సంబంధించి 276 అర్జీలు అందజేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్‌కుమార్ లు అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీ వైద్యశాఖ ఒప్పంద ఉద్యోగులు, కార్మికుల యూనియన్ నాయకులు

జ్వరాల బారిన పడుతున్నారు

పసిపిల్లలు అధిక సంఖ్యలో డెంగీ జ్వరం బారిన పడుతున్నారని బంగారుపాళెం మండలం కుమ్మరపల్లె వాసులు సురేంద్రబాబు, మోహిని అన్నారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఓ ఇంటి పక్కనే గ్రామస్తులందరూ చెత్తను తీసుకొచ్చి వేస్తున్నట్లు తెలిపారు. ఆ చెత్త పేరుకుపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేయడం లేదన్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది, పసి పిల్లలకు జ్వరాలు వ్యాప్తి చెందుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.



సమస్యను తెలియజేస్తున్న కుమ్మరపల్లి వాసులు

ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి

జిల్లా ప్రాంతీయ, సామాజిక ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనాలివ్వని ఏజెన్సీలపై చర్యలు చేపట్టాలని ఏపీ వైద్యశాఖ ఒప్పంద ఉద్యోగులు, కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రమాదేవి, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం భూముల్ని ఆక్రమించుకున్నారు

బంగారుపాళెం మండలం మొగిలి గ్రామంలో శ్మశానం భూముల్ని ఆక్రమించుకున్నారని యానాదుల కమిటీ అధ్యక్షురాలు నిర్మల ఆరోపించారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఆ గ్రామస్తులకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు మద్దతు పలికారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్థులు, సీపీఎం నాయకులు

దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు



సెల్‌ఫోన్లు ఇవ్వాలంటున్న విభిన్నప్రతిభావంతులు

విభిన్నప్రతిభావంతులకు అందజేసే సెల్‌ఫోన్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్న ఇవ్వడం లేదని విభిన్న ప్రతిభావంతులు జయశంకర్, వెంకటేష్ అన్నారు. వారు మాట్లాడుతూ గతంలో సెల్‌ఫోన్ల కోసం విభిన్నప్రతిభావంతుల శాఖ అధికారులకు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ఆలస్యంగా దరఖాస్తులు చేసుకున్న వారికి మంజూరు చేసి, తమకు అన్యాయం చేశారన్నారు. కలెక్టర్ పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలోని పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు గంగరాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల వేతనాల్లో కోత విధించిన ఈఎస్ఐ, పీఎఫ్ నగదును వెంటనే జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరామయ్య, మధు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఉపాధి పనుల తనిఖీ

యాదమరి (కాణిపాకం): తనిఖీల్లో భాగంగా సోమవారం చిత్తూరు జిల్లా ఉపాధి హామీ జిల్లా ఉపాధి హామీ విజిలెన్స్ అధికారి శివయ్య యాదమరి మండలం కోనాపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల తనిఖీ చేశారు. యాదమరి మండలంలో ఉపాధి హామీ పథకం కింద ఎక్కువగా ఏ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో కోనాపల్లిలో తనిఖీ చేశారు. కొద్ది రోజులుగా జరిగిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులపై చిత్తూరు జిల్లా విజిలెన్స్ జిల్లా ఉపాధి హామీ అధికారి శివయ్య పనులు తనిఖీ చేశారు. కోనాపల్లి చెరువులో ఫిష్ పాండ్, క్యాటిల్ పాండ్ పనులను పరిశీలించి, కొలతలు తీశారు. రెండు పనుల్లో చేసిన పనులు, ఎంబుక్ రికార్డులు నమోదు చేసిన కొలతలు, ఫీల్డ్‌లో ఉన్న కొలతలను సరి చూశారు. అనంతరం గ్రామంలోని ఉపాధి కూలీలకు అవసరమైన పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ బాలాను ఆదేశించారు. తనిఖీల్లో, ఉపాధి హామీ సహాయకులు బాల, జేఈ పరమశివం, టెక్నికల్ అసిస్టెంట్ మధు, ఫీల్డ్ అసిస్టెంట్ బాబు, పాల్గొన్నారు.

ఈవెంట్స్‌కు అనుమతించండి

చిత్తూరు అర్బన్: ప్రస్తుతం రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో జరుగుతున్న పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించిన దేహదారుఢ్య పరీక్షలు (ఈవెంట్స్)కు తను అనుమతించాలని పలువురు అభ్యర్థులు సోమవారం డీజీపీని కోరారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీని కలిసి వినతిపత్రం అందచేశారు. 2022లో ఇచ్చిన పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ ప్రకారం ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, ఈవెంట్స్‌కు శిక్షణ తీసుకుంటున్న తమను వయస్సు పైబడిందనే కారణంతో దేహదారుఢ్య పరీక్షలకు అనుమతించలేదన్నారు. రెండేళ్లకు పైగా శిక్షణ తీసుకుని, పరీక్షలకు సన్నద్ధమవుతుంటే.. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తమ ఆశలపై నీళ్లు చల్లడం భావ్యం కాదన్నారు. తమను ఎలాగైనా ఈవెంట్స్‌కు అనుమతించాలని కోరారు.

నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

- అపోలో ఆస్పత్రి వ్యవస్థాపక చైర్మన్ ప్రతాప్ సి. రెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): టెక్నాలజీతో పరుగులు పెడుతున్న తరుణంలో సరికొత్త వైద్య విధానాన్ని తీసుకొస్తూ ప్రజలకు మెరుగైన వైద్యాన్ని నాణ్యంగా అందించనున్నామని అపోలో ఆస్పత్రి వ్యవస్థాపక చైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి అన్నారు. చిత్తూరు నగరం మురకంబట్టు అపోలో కాలేజీలో డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసిన్ సెంటర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన, సతీమణి సుచిత్రతరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రారంభోత్సవం చేశారు. ప్రతాప్ సి. రెడ్డి మాట్లాడుతూ అపోలో ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తామన్నారు టెక్నాలజీని ఉపయోగించి ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలను సేకరించడానికి డిజిటల్ హెల్త్ ప్రెసిషన్ మెడిసిన్ సెంటర్‌ను చిత్తూరు అపోలో కాలేజీలో ఏర్పాటు చేశామన్నారు. ఈ సెంటర్ రోగులకు సరైన వైద్యం, మందులు, మాత్రలు అందించేందుకు దోహదం చేస్తుందన్నారు. ఈ సెంటర్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా గుండె సంబంధిత వ్యాధులు, అత్యవసర వైద్యంతోపాటు పలు రకాల వ్యాధులకు సంబంధించి సరైన మందులు, మాత్రలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం లీసెస్టర్ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో అపోలో మేనేజింగ్ డైరెక్టర్ సునీతారెడ్డి, నిర్వాహకులు వినోద్‌భట్, నరేష్‌కుమార్‌రెడ్డి విదేశీ వైద్య నిపుణులు హల్మీయ హోలాండ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవం చేస్తున్న ప్రతాప్ సి.రెడ్డి

వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మందు పిచికారిని పర్యవేక్షిస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మి

తవణంపల్లె: పశువులకు వ్యాధులు సోకకుండా పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని చిత్తూరు రీజినల్ పశువ్యాధి నిర్ధారణ కేంద్రం డీడీ డాక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. పశు ఆరోగ్య సదస్సులో భాగంగా సోమవారం మండలంలోని కె.పట్నం, టి.పుత్తూరు, పైమాఘం, చారాల గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. కె.పట్నంలో నిర్వహించిన పశు వైద్యశిబిరాన్ని చిత్తూరు రీజినల్ పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం డీడీ డాక్టర్ శ్రీలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా పశువులు, గొర్రెలు, మేకలు, దూడలను పరీక్షించారు. నాలుగు గ్రామాల్లో 604 పశువులకు పిడుదుల నివారణకు మందులు పిచకారి చేయించినట్లు తవణంపల్లె పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య తెలిపారు.

మామిడి రైతులు ఆచితూచి వ్యవహరించాలి



జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రైతులు మామిడి పూత విషయంలో ఆచితూచి వ్యవహరించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా మామిడి పంటకు హాని కలుగుతుందన్నారు. నాలుగు రోజుల పాటు మామిడికి ఎండ తగిలితే పూత పుంజుకునే అవకాశం ఉందన్నారు. అయితే ఇప్పటికే కొన్ని చోట్ల పూత వచ్చిందన్నారు. ఆ పూతకు తేనేమంచు, బూడిద తెగుళ్ల ఆశించకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారుల సూచనల మేరకు మందులు పిచికారి చేసుకోవాలన్నారు. క్లోరోపైరిపాస్ 2ఎంఎల్‌కు లీటర్ నీరు, వేపనూనె 2 మి.లీకు లీటర్‌నీరు, మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఇలా చేస్తే పంటను తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చన్నారు. అలాగే పూత రాలేదని ఇష్టానుసారంగా మందులు పిచికారి చేయవద్దన్నారు. పూత వచ్చిన వారు పిందె రాలిపోకుండా మందులు పిచికారి చేసుకోవాలని ఆయన వివరించారు.

నేడు బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఎన్నికపై సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడి ఎన్నికపై మంగళవారం చిత్తూరులో సమావేశం జరగనుంది. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందని పార్టీ నాయకులు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర పార్టీ ఎన్నికల పరిశీలకులు శివనారాయణ, జిల్లా ఎన్నికల అధికారి ఎల్లారెడ్డి రానున్నట్లు తెలుస్తోంది. జిల్లా అధ్యక్షుడు పదవి రేసులో ఉన్న నాయకులు, వారి మద్దతు, పనితీరు పలు అంశాలను సమావేశంలో చర్చించి తదుపరి నిర్ణయం ప్రకటించనున్నట్లు సమాచారం. కాగా సోమవారం పదవి కోసం పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు ముఖ్య నాయకులతో తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఇదంతా చూస్తుంటే నివురుకప్పిన నిప్పులా ఉన్న బీజేపీలోని వర్గపోరు బయట పడింది.

మామూళ్లు ఇచ్చుకో.. వ్యభిచారం రైట్ రైట్

- హోమ్‌గార్డ్, లాడ్జి మేనేజర్ మధ్య సంభాషణ
- వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతున్న భాగోతం

వి.కోట : శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులే నిందితులకు అండగా ఉంటూ "మేముండాం.. నువ్వు ఏమైనా చేసుకో.. మాకు మామూళ్లు ఇచ్చుకో.. మేం చూసుకుంటాం" అంటూ ఫోన్‌లో హోంగార్డ్, లాడ్జి నిర్వాహకుడి మధ్య జరిగిన సంభాషణ సోమవారం వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. వి.కోట పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి పట్టణంలోని ఓ లాడ్జి నిర్వాహకుడి మధ్య వ్యభిచార నిర్వహణ.. మామూళ్లపై సెల్‌ఫోన్‌లో జరిగిన సంభాషణ వైరల్‌గా మారింది. ఇందులో హోంగార్డు మాట్లాడుతూ 'మాకు ప్రతి నెలా మామూళ్లు ఇచ్చుకుని లాడ్జిలో వ్యభిచారం(బ్రోతలింగ్) నిర్వహించుకో.. మన సార్ మనకు ముందుగా సమాచారం ఇస్తాడు. రైడింగ్ జరిగితే నేను నీకు ముందుగా సమాచారం ఇస్తాను. ఎవరికీ అనుమానం రాకుండా అమ్మాయిలను తెప్పించుకో.. మిగతా విషయాలు నేను చూసుకుంటా.. నువ్వు మాకు ప్రతి నెలా మామూళ్లు ఇస్తే చాలు.. జాగ్రత్త.' అంటూ లాడ్జి నిర్వాహకుడితో జరిపిన సంభాషణ వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోంది.

హక్కుల పరిరక్షణ సమితి నూతన జిల్లా కమిటీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి చిత్తూరు జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైందని ఆ సమితి నేత సంగటి మనోహర్ మహాజన్ తెలిపారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చిత్తూరు జిల్లా కమిటీని ప్రకటించారు. సంఘం గౌరవాధ్యక్షుడుగా మునస్వామి, జిల్లా కన్వీనర్‌గా బి పార్థసారథి, కోకన్వీనర్లుగా ఉదయ్‌కుమార్, అశోక్ కుమార్ , సభ్యులుగా కరుణాకరన్ రాజేష్, జయ కుమార్, బుల్లెట్ బాబు ఎన్నికయ్యారన్నారు.

యువతి ఆత్మహత్య

బైరెడ్డిపల్లె: పురుగుల మందు తాగి, ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కడతట్లపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ పరుశురాముడు కథనం.. కడతట్లపల్లె గ్రామానికి చెందిన రవీంద్రరెడ్డి కుమార్తె మైత్రి (21) ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి, ఆత్మహత్యకు పాల్పడింది. విషయం గమనించిన గ్రామస్తులు కుటుంబసభ్యులకు సమాచారం అందించి పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. రవీంద్రరెడ్డికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పలువురు తహసీల్దార్లకు పోస్టింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పలువురు తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు పలమనేరు తహసీల్దార్ ఇన్బనాథన్‌కు పెద్దపంజాణి అదనపు బాధ్యతలు తొలగించారు. పలమనేరు డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్‌ను పెద్దపంజాణి తహసీల్దార్‌గా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల మద్యం మత్తులో దాడికి పాల్పడి, సస్పెండ్ అయిన పెద్దపంజాణి డీటీ ప్రసన్నకుమార్‌ను కుప్పం ఆర్డీఓ కార్యాలయం డీటీగా నియమించారు. చిత్తూరు రీ సర్వే డీటీ ఏకాంబరాన్ని గంగాధరనెల్లూరు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించారు.

బైక్ దొంగల అరెస్టు



స్వాధీనం చేసుకున్న బైక్‌లు, నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

వి.కోట: మండలంలో మోటార్‌సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని సోమవారం వి.కోట పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. వి.కోట-కుప్పం జాతీయ రహదారిలోని అన్నవరం క్రాస్ వద్ద వి.కోట పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి బైక్‌పై వెళుతుండగా అనుమానం వచ్చి, అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దీంతో బైక్‌ల చోరీ విషయం బయటపడింది. నిందితుడు వి.కోట మండలం పడిగలకుప్పం గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి కుమారుడు విశ్వనాథ్‌రెడ్డి(31) మండలంలోని బైరుపల్లి గ్రామానికి చెందిన లేట్ వెంకటనారయణప్ప కుమారుడు నాగరాజు (34) అనే వ్యక్తితో కలిసి జల్సాలు చేయడానికి అలవాటు పడి బైక్‌లు చోరీ చేస్తున్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు., నిందితులిద్దరినీ అరెస్టు చేసి, రిమాండుకు తరలిస్తున్నటు సీఐ పేర్కొన్నారు.

28 నుంచి దేవుని కడపలో బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ జిల్లాలోని దేవుని కడపలోనున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు జరగనున్నాయి. ఈమేరకు సోమవారం టీటీడీ పరిపాలనా భవనంలోని ఈఓ చాంబర్‌లో టీటీడీ ఈఓ జె.శ్యామలరావు స్వామివారి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 28న సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల మధ్య అంకురార్పణ, 29న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 3న స్వామివారి కల్యాణోత్సవం చేపడతారు. రూ.300 చెల్లించి గృహస్తులు కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. అలాగే ఫిబ్రవరి 7న పుష్పయాగం జరగనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీ.వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, డెప్యూటీ ఈఓలు నటేష్‌బాబు, ప్రశాంతి పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈఓ, జేఈఓ

స్నానఘట్టాలు..మురికి కూపాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ స్నానఘట్టాలు మురికి కూపాలుగా మారాయి. ప్రతి ఏటా త్రిశూల స్నానం నిర్వహించే నీటి తొట్టిలో మురుగు నీరు నిండి దుర్గంధభరితంగా మారింది. పొరపాటును ఎవరైనా స్వర్ణముఖి నది వద్దకు వెళ్లాలని కిందకు వస్తే ముక్కు పట్టుకోవాల్సిందే. ఆలయం తరఫున సుమారు 80 మంది, కాంట్రాక్టర్ పరిధిలో 175 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. మొత్తంగా 250 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. వీరిని పర్యవేక్షించేవారు అదనంగా ఉన్నారు. కానీ ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచలేకపోతున్నారు. జలవినాయకుని వద్ద అనేక సంవత్సరాలుగా చిన్న వర్షం పడినా నీరు నిలబడి అలాగే ఉండిపోతోంది. ఆలయ అధికారులు అనేకసార్లు కాలువలు, పైపులైన్లతో ఫలితం లేకుండా పోయింది. ఆలయానికి శివయ్యగోపురం నుంచి వెళ్లే భక్తులు, జలవినాయక ఆలయం వద్దకు వచ్చే వారు. ఆ నీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. దీనిపై సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నా ఆలయ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



జలవినాయకుని ముందు నీటి మడుగు